పెన్నిలి హైమావతి

**“డోంట్ బీ చైల్డిష్! వాడెవడో నా ప్రమేయం లేకుండా, నా మీద ఊహలల్లేసుకుంటే దానికి నేనా బాధ్యురాలిని? నాకంటూ కొన్ని ఆలోచనలున్నాయి, అభిప్రాయాలున్నాయి. జీవితం పట్ల ఏ అవగాహనా, లక్ష్యం లేకుండా గాలివాటుగా... ప్రేమించాను, పెళ్లాడుతాను అంటే సరేననమంటావా?” అంది విద్య స్నేహితురాలి వంక తీవ్రంగా చూస్తూ.**

# సాలెగూడు

''అది కాదే పాపం! ఆ అబ్బాయి నీకోసం పిచ్చివాడిలా తిరుగుతున్నాడే. రెండు రోజుల నుండి తిండి తినలేదట. ఎలాగైనా ఒకసారి తనతో మాట్లాడేలా చేయమని నన్ను రిక్వెస్టు చేశాడే!'' అంది ఇందిర.

''ఎందుకట మాట్లాడడం? ప్రతి అడ్డమైన సినిమాలూ చూసి అందులో హీరోల్లా తమని తాము ఊహించుకుంటూ ప్రేమ..ప్రేమంటూ ఇలా తిరిగే బదులు... ఆ శక్తిని కాస్త కెరీర్‌ని డెవలప్ చేసుకునేందుకు వినియోగిస్తే- అతడు బాగుపడ్డమే కాదు, సమాజం కూడా బాగుపడుతుంది'' అంది విద్య.

''ఏంటే..నువ్వసలు ఆడపిల్లవు కాదా? నీలో చలనం లేదా? అందమైన అబ్బాయి అలా నీ వెంట పడుతూంటే ఇలా రాయిలా ఎలా ఉండగలుగుతున్నావే? ఇదే నేనయితేనా? ఎగిరి గంతేద్దును!'' అంది ఇందిర ఉద్వేగంగా.

''ఇప్పుడు మాత్రం ఏం మునుచుకుపోయింది? అంత సరదాగా వుంటే..ఐ లవ్ యూ చెప్పి లైన్లో పెట్టుకో అతనిని..నేను కాదన్నానా?'' అంది విద్య వెటకారంగా.

''ఛీ.. అదేం మాట? అతను ప్రేమించింది నన్ను కాదు, నిన్ను. అలాంటప్పుడు నేనెందుకు చెప్తాను ఐ లవ్ యూ?'' అంది ఇందిర నిష్ఠూరంగా చూస్తూ.

''మరందుకే నోరు మూసుకు కూర్చోమనేది. అసలు నాకీ ప్రేమల మీదా, వాటిమీదా నమ్మకం గానీ, ఇష్టంగానీ లేదు. జీవితంలో ఇవన్నీ ఒక భాగం మాత్రమే! ఇదే మొత్తం జీవితం కాదు. అందుకు మనని కని ఇంతకాలం పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులున్నారు. మనకి ఏది కావాలో..ఏది మంచో, ఏది చెడో వివరించి మనకి సెక్యూర్డ్ లైఫ్ అందించేందుకు.

జీవితం సినిమా కాదు. ప్రేమిస్తావా? ఛస్తావా? అని అమ్మాయిల సీకల మీద కూర్చొని... పిచ్చి పిచ్చి చేష్టలు చేస్తే...ఆ పిల్ల ప్రేమించేసి కనిపెంచిన అమ్మానాన్నలను వదిలేసి వాడి వెంట వెళ్లిపోవడానికి.

ఆ సినిమాల వాళ్లు సొమ్ము చేసుకునేందుకు సవాలక్ష టెక్నిక్‌లు ఉపయోగించి పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో, సన్నివేశాలతో నింపి..మనల్ని మైకంలో ముంచెత్తుతున్నారు. ప్రపంచంలో ప్రేమ తప్ప మరో విషయం లేదన్నట్లుగా చూపి మనలాంటి యువతను తప్పుదారి పట్టిస్తున్నారు. కానీ ఇవన్నీ చెప్పి..చూపించే ఆ ప్రబుద్ధులే..తమ పిల్లలకో..తోడబుట్టిన వాళ్లకో అలా ఎంకరేజ్ చేసి పెళ్లిళ్లు చేసేస్తున్నారంటావా? ఆలోచించు..వాళ్లకి మాత్రం లైఫ్‌కి సెక్యూరిటీ కావాలి..మనం మాత్రం వాళ్లు చూపించే భ్రమలనే నిజమని నమ్మి దీపం చుట్టూ తిరిగే పురుగుల్లా... ఆ ఆకర్షణలకి లొంగి శలభాల్లా మాడిపోతున్నాం. ఎందుకొచ్చిన కబుర్లివన్నీ..నాకు పనుంది. దయచేసి నన్ను వదిలెయ్యి'' అంటూ లేచింది విద్య అక్కడి నుండి.

''అయితే నీ దృష్టిలో ప్రేమనే దానికి విలువే లేదా? ఈ ప్రేమించుకొనే వాళ్లంతా మనుషులే కాదంటావా?'' అంది ఇందిర రెట్టిస్తున్నట్లుగా.

''అలా అని నేనెందుకంటాను. ప్రేమకి విలువలేదని..ప్రేమికులు పనికిమాలిన వాళ్లని నేనన లేదే..దానికిది తగిన సమయం కాదంటున్నాను. మన అమ్మానాన్నలు మనమీదెంతో నమ్మకముంచి ఇలా చదువుకోసం బయటకు పంపిస్తూంటే..వాళ్ల నమ్మకాన్ని వమ్ముచేస్తూ..మన లక్ష్యాన్ని మరిచి ఈ కల్లబొల్లి కబుర్లకి మురిసి మూర్ఛపోయి బోర్లాపడకూడదంటున్నాను. ఈ ప్రేమలూ వగైరాలు లైఫ్‌లో మనం స్థిరపడ్డాక..మన మనసుకు పరిణతి ఏర్పడ్డాక ఆలోచించవలసిన విషయాలు. మన మంచిచెడ్డలు చూసేందుకు అమ్మానాన్నలు ఎలాగూ ఉంటారు. నా అభిప్రాయం ఇది, ఇందులో ఏ మార్పూ ఉండదు. ఓ ఫ్రెండ్‌గా నేను నీకిచ్చే సలహా కూడా ఇదే! ఈ ప్రేమాదోమాలకి గుడ్ బై కొట్టి చదువుమీద కాన్సంట్రేట్ చెయ్యి, మంచి రాంక్ వస్తుంది'' అంది విద్య సలహా ఇస్తున్నట్లుగా.

ఇందిర ఇంకేం మాట్లాడకుండా అక్కడి నుండి వచ్చేసింది 'నాయనమ్మలా సోది చెప్తోంది ఇది' అనుకుంటూ.

ఇంతలో ''సిస్టర్, సిస్టర్! ఏమంది విద్య?'' అంటూ ఆదుర్దాగా వచ్చాడక్కడికి రమేష్.

''సారీ రమేష్! మా విద్యకి ఇలాంటి వాటిమీద నమ్మకంగానీ, ఇష్టంగానీ లేదట! గుడ్ బై..'' అంటూ మరో మాటకు అవకాశం ఇవ్వకుండా అక్కడి నుండి వెళ్లిపోయింది ఇందిర.

అయినా రమేష్ అక్కడితో విద్యను వదిలిపెట్టలేదు. విద్య ఎక్కడికి వెళ్తే అక్కడికి నీడలా వెంటాడుతూ టీజ్ చేస్తున్నట్లుగా ప్రవర్తించసాగాడు.

నాకెందుకులే అన్నట్లుగా లెక్క చెయ్యడం మానేసింది విద్య. చివరికి చూసి చూసి రమేష్ విసిగిపోయి ఊరుకున్నాడు. అలా ఉదయపు ఎండలా పుట్టిన ప్రేమ..మధ్యాహ్నపు సూర్యుడిలా మండి..అటునుండి ఎలాంటి రెస్పాన్స్ లేకపోవడంతో..సాయం సంధ్యలా చల్లబడిపోయింది. మరో వేకువకోసం ఎదురుచూసే సూర్యునిలా మరో అమ్మాయి వేటలో పడిపోయాడు రమేష్.

అప్పుడంది విద్య..ఇందిరతో..''చూశావా, నువ్వు రాయబారం నడిపిన ప్రేమకు గల నిబద్ధత ఎంతో? వీళ్లలాంటి వాళ్ల కోసమా మన అమ్మానాన్నలను మోసగించేదీ...ఒదులుకునేదీనూ?'' అంది పదునుగా చూస్తూ.

''బాగుంది, నువ్వు కాదన్నాక..ఇంకా నీ వెంటే తిరుగుతూ జీవితం వేస్టు చేసుకోమంటావా?'' అంది ఇందిర హేళనగా.

''నిజమైన ప్రేమంటే అదే కదా నీ భాషలో..ఎన్ని అవరోధాలు ఎదురైనా సాధించాలి కదా మరి..'' అంది అదే స్థాయిలో ఇందిర మాటని తిప్పికొడుతూ.

''అయితే ఇప్పుడెళ్లి రమేష్‌తో చెప్పనా తన ప్రేమని నిరూపించుకోమని'' అంది ఇందిర



ఛాలెంజింగ్‌గా చూస్తూ.

''పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడావంటే తంతాను. వాడి బుద్ధి ఎలాంటిదో ఇప్పటికైనా తెలుసుకోమన్నానేగానీ, వాడిని ప్రేమని నిరూపించుకోమని కాదు'' అంటూ విసురుగా వెళ్లిపోయింది విద్య అక్కడి నుండి.

★ ★ ★

విద్య తన చదువేదో తను అన్నట్లుగా ఉంటే... ఇందిర...లోకంలో ఉన్న అందం, ఆనందం ఎంత వీలయితే అంత ఎక్కువగా జుర్రుకోవాలన్న ఆరాటంతో తాను చూసే సినిమాల్లోని కథానాయికల లాగా తానూ ఉండాలని, వీర లెవెల్లో ప్రేమించి పెళ్లాడేసి..సినిమాల్లోలా ఖరీదైన మేడల్లో ఉంటూ కారుల్లో తిరగాలని కలలు కనసాగింది.

తల్లిదండ్రులు పిల్లల చదువులకు కష్టపడి పంపే డబ్బుతో కులాసాగా కాలక్షేపం చేసే అబ్బాయిలు..ఇలాంటి అమ్మాయిలకు ఖర్చుపెట్టి, ఖరీదైన బహుమతులిచ్చి..ఎరవేసి..ఈస్ట్‌మన్ కలర్‌లో తమ భావి జీవితాన్ని తమ గర్ల్‌ఫ్రెండ్స్ ముందుంచుతూ, అతి నాజూకుగా, వాళ్ల మనసులను కొల్లగొట్టి తమకై తాము అర్పించుకునే స్థాయికి తీసుకు వస్తున్నారు. అలాంటి వలలో చిక్కుకుంది అతి తేలికగా ఇందిర.

ఇందిర సంగతంతా తెలిసిన విద్య ఓరోజు ''ఏమిటే ఇందిరా ఇదంతా? ఎంత చెప్పినా నువ్వీ భ్రమను విడిచిపెట్టడం లేదు, ఎందుకొచ్చిన పనులే ఇవన్నీ..నీ గురించి మన కేంపస్‌లో ఎంత చెడ్డగా అనుకుంటున్నారో తెలుసా? ఈ సంగతి మీ అమ్మానాన్నలకు తెలిస్తే తట్టుకోగలరా?'' అంది బాధగా.

''నాకు నువ్వేం నీతులు చెప్పనక్కరలేదు. ఆకాష్ ఎలాంటి వాడో నాకు బాగా తెలుసు. నాకోసం నిప్పుల్లో దూకమన్నా దూకుతాడు. అసలు నీకో నిజం తెలుసా? ఇన్ని రోజులుగా మేం కలిసి తిరుగుతున్నా..ఇంతవరకూ ఆకాష్ నన్ను తాకనైనా తాకలేదు'' అంది గొప్పగా చూస్తూ.

ఆ మాటలు విని తలపట్టుకుంది విద్య.. ''అయ్యో..ఇందిరా! ఈమధ్యకాలంలో ఇదో కొత్త టెక్నిక్ అయిపోయిందే..మనలాంటి వాళ్లని నమ్మించి లొంగదీసుకునేందుకు ఇదో కొత్త ఆయుధంలా ఉపయోగించుకుంటున్నారే. ఉత్త ప్రేమా, ఎంజాయ్‌మెంట్ అంటే మనం లొంగమని, తాకకుండా నిగ్రహం చూపించడం, బహుమతులిచ్చి ఆకట్టుకోవడం, నువ్వింతదానివి అంటూ ఆకాశానికెత్తేయడం..నీకోసం ఏదైనా చేసేస్తానంటూ భీషణ ప్రతిజ్ఞలు చేయడం చేస్తున్నారే! అవన్నీ వెర్రిగొర్రెల్లా నమ్మేసి వాళ్ల మాయలో పడి చివరికి వాళ్లాడించినట్లుగా ఆడుతున్నారే'' అంది బాధగా స్నేహితురాలి వంక చూస్తూ.

''నువ్వేన్నన్నా చెప్పు..నా ఆకాష్ అలాంటి వాడు కాదు!'' అంది ఇందిర ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్లుగా విద్య వంక చూస్తూ.

ఆ మైకంలో పడిన ఇందిరను ఎలా బైట పడేయాలో అర్థం కాలేదు విద్యకు. చివరికి విషయమంతా వివరిస్తూ ఇందిర తల్లిదండ్రులకు ఉత్తరం రాసింది విద్య.

అయితే తమ బిడ్డలమీద, తమ పెంపకం మీద అపారనమ్మకం ఉన్న ఇందిర తల్లిదండ్రులు అంత తొందరగా విద్య రాసిన విషయాన్ని నమ్మలేదు. ఎందుకైనా మంచిదని ఇందిర తండ్రి గోపాలరావు గారు వచ్చి విద్యని కలిశారు. విద్య మాటలు విన్నాక ఉత్తరంలో రాసిందానికంటే మేటర్ చాలా దూరం వెళ్లిపోయిందని గ్రహించిన గోపాలరావు గారు డీలాపడిపోయారు.

''మీరలా అయిపోతే ప్రయోజనం ఏమీ ఉండదంకుల్. మీరు ఆకాష్‌నూ, వాళ్ల పేరెంట్స్‌నూ కలిసి విషయం తెలుసుకోండి. అప్పుడు దీనికో పరిష్కారం ఆలోచించవచ్చు'' అంది విద్య సలహా ఇస్తున్నట్లుగా.

''ఏ తల్లి కన్నబిడ్డవోనమ్మా నువ్వు. నిన్ను చూస్తుంటే ముచ్చటేస్తున్నది. నీలాగే అందరు ఆడపిల్లలూ ఉంటే..మాలాంటి తల్లిదండ్రులకీ క్షోభ ఉండదు కదమా!'' అన్నారాయన బాధగా.

''బాధపడకండంకుల్! ఇందిర ఉత్త అమాయ కురాలు. దానికేం కావాలో దానికే తెలియదు. మీరు ఆకాష్‌తో ముందు వెళ్లి మాట్లా డండి..అంతా సరయిపోతుంది'' అంది విద్య ఓదార్పుగా చూస్తూ.

★ ★ ★

''నువ్వేనా, ఆకాష్ అంటే?'' అనడిగారు గోపా లరావుగారు ఆకాష్ వంక పరిశీలనగా చూస్తూ.

''అవును. నేనే! మీరెవరు?'' అన్నాడు ఆకాష్ ప్రశ్నార్థకంగా గోపాలరావుగారి వంక చూస్తూ.

''నేను ఇందిర తండ్రిని..'' అన్నారు గోపాలరా వుగారు.

ఆ మాట వినడంతోనే ఉలిక్కిపడ్డట్లయ్యాడు ఆకాష్. అంతలోనే సర్దుకుంటూ...''మీరా అంకుల్..నమస్తే! రండంకుల్, కేంటీన్ కెళ్లి కాఫీ తాగుదాం!'' అన్నాడు మర్యాద చేస్తున్నట్లుగా.

''ఇప్పుడలాంటివేం వద్దుగానీ..మా ఇందిరా నువ్వూ చాలా చనువుగా తిరుగుతున్నారని ఇక్క డంతా చెప్పుకుంటున్నారట..మీరిక్కడికి వచ్చింది చదువుకునేందుకా? ఇలా ప్రేమకలా పాలు నడిపేందుకా?'' అన్నారు కోపంగా ఆకాష్ వంక చూస్తూ.

''ఎందుకంత కోపం అంకుల్? ఇప్పుడు మేము ఏమంత కాని పని చేశామని? ఇద్దరు వయసులో ఉన్న యువతీ యువకులం. కాస్త సరదాగా తిరిగి నంత మాత్రాన కొంపలు అంటుకుపో తాయా?'' అన్నాడు ఆకాష్. తాను చూసిన సిని మాలోని హీరోని అనుకరిస్తూ జవాబిచ్చాడు.

''కొంపలు నీకంటుకుపోకపోయినా మాకంటు కుపోతాయి బాబూ! సరే జరిగిందేదో జరిగింది. ఇకమీదట మా అమ్మాయి ఊసెత్తితే పరిణా మాలు చాలా తీవ్రంగా ఉంటాయి'' అన్నారు గోపాలరావుగారు వార్నింగిస్తున్నట్లు.

''ఏంటండీ తీవ్రంగా ఉండేది? నేనొక్కడినే ఏదో మీ అమ్మాయి వెంట పడి తిరిగినట్లు మాట్లాడ తారూ? అసలు నేను చిటికేస్తే మీ అమ్మాయి నా ఒళ్లో వచ్చి వాలిపో తుంది. ఇంకా నేను మంచివాడిని గనక..ఇంత వరకూ మీ అమ్మాయి వంటి మీద చెయ్యి వెయ్యలేదు'' అన్నాడు ఆకాష్ గర్వంగా గోపాలరావు గారి వైపు చూస్తూ.

''మంచిది బాబూ, ఆమాత్రం ఉప కారం చేశావంటే చాలు. మా అమ్మా యిని ఎలా అదుపులో పెట్టుకోవాలో నాకు తెలుసుగాని..ఇకమీదట మా అమ్మాయి జోలికొచ్చావంటే మర్యాదగా ఉండదు'' అన్నారు గోపాలరావుగారు తీవ్రంగా చూస్తూ.

''ఆ..పెట్టుకోండి అదుపులో..తను మీ మాట వింటుందో, నామాట వింటుందో చూద్దాం!'' అన్నాడు వెక్కిరింతగా చూస్తూ.

తామిన్నాళ్లూ కని పెంచి, అల్లారుముద్దుగా పెంచిన బిడ్డ..తన భవిష్యత్తుకోసం నిరంతరం ఆరాటపడే తమని కాదని..నిన్నగాక మొన్న పరిచ యమైన అతనిమాటే వింటుందా? నమ్మలేన ట్లుగా ఆకాష్ వంక చూసి భారమైన మనసుతో అక్కడి నుండి కదిలారు గోపాలరావుగారు.

''ఇందూ..నా మాట వినమ్మా..ఈ ప్రేమలూ, ఆకర్షణలూ తాత్కాలికమే నమ్మా..ఇలాంటి వాటికోసం..బంగారంలాంటి నీ భవిష్యత్తును పాడు చేసుకోకమ్మా..ఎంతో కష్ట పడి ఈ స్థాయికొచ్చిన నువ్వు... కన్నవారినే కాదు, నీ చదువుని కూడా నిర్లక్ష్యం చేస్తున్నావు. నీ లైఫ్‌ని చేజేతులా పాడుజేసుకోకమ్మా!'' అన్నారు గోపాలరావుగారు నచ్చజెప్పున్నట్లుగా.

''లేదు నాన్నా, ఆకాష్ ఎంత మంచివాడో నేను వివరించి చెప్పలేను. మాది ఆకర్షణ ఎంత మాత్రం కాదు నాన్నా..అతను నేను లేకపోతే బ్రత కలేడు నాన్నా!'' అంది ఇందిర ఉద్వేగంగా.

ఆకాష్ చెప్పినట్లుగా.. ఇందిర ఎవరితోనూ పని లేనట్లుగా..ప్రపంచమంతా ఆకాషే నిండి ఉన్న ట్లుగా మాట్లాడడంతో చేసేదేం లేక..ఇందిరను వెంట బెట్టుకొని మళ్లీ ఆకాష్ దగ్గరకు వెళ్లారు గోపాలరావుగారు, ఇంతవరకూ వచ్చాక తాను చేయగలిగిందేమీ లేదని గ్రహించడంతో.

వాళ్లిద్దరూ కలిసి రావడం చూసిన ఆకాష్ తన బాటుగా లేచాడక్కడి నుంచి. తప్పదన్నట్లుగా పలకరింపుగా నవ్వుతూ ఆహ్వానించాడు తన రూమ్‌లోకి ఇద్దర్నీ.


గోపాలరావుగారు సూటిగా విషయంలోకి వచ్చే శారు. ''ఆకాష్! నేను ఇందిరతో మాట్లాడాను. నువ్వున్నట్లే తను నిన్ను తప్ప వేరెవర్నీ పెళ్లి చేసుకో నని చెప్పింది. ఇంత జరిగాక..నలుగురూ మీ గురించి చెడ్డగా అనుకోకముందే.. మీ పెద్దవా ళ్ళను కలిసి..ఓ మాట అనుకుంటే అందరికీ మంచిది. ఏమంటావు?'' అన్నారు.

ఆ మాటలు విని ఇబ్బందిగా కదిలాడు ఆకాష్. ఆత్రుతగా తన వంకే చూస్తున్న ఇందిర వంక సూటిగా చూడలేకపోయాడు. చూపులు మర ల్చుకొని..'' సారీ అంకుల్! నిన్న మీరు వచ్చిన ప్పుడు చాలా దురుసుగా మాట్లాడాను. మా పెళ్లికి మా పేరెంట్స్ ఒప్పుకోవడం లేదు. వాళ్లను కాదని..ఎదిరించి నేనే పనీ చెయ్యలేను. తొందర పడి మీ అమ్మాయిని చాలా డిస్టర్బ్ చేశాను. నన్ను క్షమించండి. ఎలాగో ఇందిరకు మీరే నచ్చజె ప్పండి'' అన్నాడు ఆకాష్ గొంతు పెగల్చుకొని.

తాను వింటున్నదేమిటో అర్థంగాక మతిపోయి నట్లుగా చూసింది ఇందిర ఆకాష్ వైపు.

ఇన్ని రోజులూ ఎంతో వీరోచితంగా..అది చేస్తాను, ఇది చేస్తాను.. అలా ఉందాం, ఇలా ఉందాం అంటూ..ఊరించి ఊరించి ఇందిరతో కబుర్లు చెప్పిన ఆకాష్ సమయం వచ్చేసరికి ఇలా మాట్లాడడంతో మతిపోయినట్లయింది ఇంది రకి. ఆకాష్‌తో జీవితాన్ని ఎంత అద్భుతంగా ఊహించుకుంది తను? ఏమైంది చివరికి? మొదటి నుండీ విద్య హెచ్చరిస్తూనే ఉంది. ఇలాంటి ప్రేమ వ్యవహారాల జోలికి పోవద్దని. తనే వెర్రిదానిలా భ్రమలో పడిపోయి..సాలెగూడులో చిక్కిన ఈగలా ఈరోజున గిలగిల లాడిపోతు న్నది బైటకు రాలేక - అనుకుంది ఇందిర. ఏడవ డానికి కూడా ఓపిక లేనట్లుగా తండ్రి భుజం మీద తలవాల్చింది నిస్సత్తువగా.

''నాకు తెలుసు. నా కూతుర్నిలా ముంచుతా వని. కానీ..పిచ్చిది..ఇదే నీ నిజస్వరూపం అని తెలుసుకోలేకపోయింది'' అని ఛీత్కారం చేస్తూ ఇందిరను నడిపించుకొని బైటకు వచ్చారు గోపాల రావుగారు.




★ ★ ★

విద్య, ఇందిరా కలిసి గోపాలరావు గార్కి వీడ్కోలు ఇవ్వడానికి స్టేషనుకు వచ్చారు.

''చూడమ్మా! ఈ ప్రేమలనేవి పద్మ వ్యూహం లాంటివి. అందులోకి నీలాంటివారు అభిమన్యుడిలా దూసుకువెళ్లగలరే గానీ ఛేదించి విజ యంతో బైటకు రాలేరు. నీది ఇరవై ఏళ్ల ఆవేశం. నాది యాభై ఏళ్ల అను భవం. ఇక ముందయినా మెలకువగా ప్రవర్తించు. వస్తాను'' అంటూ వీడ్కోలు తీసుకున్నారు.